క్లుప్తంగా

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు బ్యాగుల అందజేత

ఏర్పేడు: పిల్లలకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని ఎండీ పుత్తూరులో నేను బడికిపోతా కార్యక్రమం, ర్యాలీ, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ జరిగింది. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని సూచించారు. ఎస్టీ కాలనీల్లో విద్యార్థులు చదువుకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. చదువు ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి లోకముని, ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలతో కాలువ మరమ్మతులు



సర్వే చేయిస్తున్న అధికారులు

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని నేతాజీ రోడ్డులో వైఎస్సార్ విగ్రహం సమీపంలోని మలుపు వద్ద 15 ఆర్థిక సంఘం నిధులతో మురుగు కాలువ మరమ్మతులు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద కాలువపై పైపులు అమర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ. 2లక్షలు అంచనాతో పనులు చేపడతామన్నారు. మంగళవారం ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ మునిరవికుమార్, ఆర్అండ్‌బీ ఏఈ ఇజ్రాయిల్ కాలువ మలుపు వద్ద స్థలాన్ని పరిశీలించి సర్వే చేయించారు. సర్పంచ్ మంజుల, మాజీ సర్పంచ్ ధర్మారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హర్ష, సీనియర్ అసిస్టెంట్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత



విద్యా సామగ్రిని అందజేస్తున్న మహేష్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం గురుదక్షిణామూర్తి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల కోసం మంగళవారం పట్టణానికి చెందిన వెంకటముని పెట్రోల్‌బంకు యజమాని మహేష్ పలకలు, పుస్తకాలు, పెన్నులు, బలపాలను వితరణగా అందజేశారు. వీటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

బడి బయట పిల్లలు బడిలో చేరిక



అడ్మిషన్ ఇస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజుల పెళ్లూరు పంచాయతీ పరిధిలోని ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీలో బడి మానేసిన బడి ఈడు పిల్లలను మంగళవారం ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని తెలిపారు. బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలచేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు.

ఏర్పేడులో బైక్ చోరీ

ఏర్పేడు: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం మంగళవారం పగలే చోరీకి గురైంది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని బండారుపల్లికి చెందిన రామిరెడ్డి తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో లగేజీ కూలీగా పని చేస్తున్నాడు. రోజు ఉదయం 6 గంటలకు తన బైక్‌ను ఏర్పేడు యూనియన్ బ్యాంకు ముందు ఉన్న రోడ్డు పక్కన ఉంచి సైడ్ లాక్ వేసి తిరుపతికి బస్సులో వెళ్తాడు. తిరిగి సాయంత్రం 6 గంటలకు ఏర్పేడుకు చేరుకుని ఇంటికి వెళ్తుంటాడు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం తిరుపతిలో విధులు ముగించుకుని ఏర్పేడుకు వచ్చి చూడగా బైక్ లేదు. చుట్టుపక్కల ఉన్న పలు దుకాణ యజమానులను ఆరా తీశాడు. చోరీకి గురైందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఈశ్వర్‌రెడ్డి లా కాలేజ్‌పై నిషేధం

తిరుపతి సిటీ: రాష్ట్రంలోని లా కళాశాలలపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కొరడా ఝుళిపించింది. ఇందులో భాగంగా ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో నడుస్తున్న ఏర్పేడు మండలం అంజిమేడులోని ఈశ్వర్‌రెడ్డి లా కాలేజ్‌పై నిషేధం విధించింది. ఈ మేరకు మంగళవారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు అందేవరకు కళాశాలలో అడ్మిషన్లు చేపట్టరాదని ఆదేశించింది.

అప్రమత్తతతో సీజనల్‌కు చెక్

వర్షాకాలం వచ్చిందంటే వ్యాధుల కాలం ఆరంభమైనట్లే. వాతావరణంలో మార్పులతో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. అపరిశుభ్రత, ఆహారంలో లోపాల కారణంగా రోగాలు వస్తాయి. ముందు జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి నిల్వ ఉండడంతో వ్యాధి కారకాలైన దోమలు, సూక్ష్మక్రిములు, బాక్టీరియా వృద్ధి చెందుతాయి. వానాకాలంలో సాధారణ జ్వరం దగ్గర నుంచి ప్రమాదకరమైన డెంగీ వరకు సోకే అవకాశం ఉంది. అప్రమత్తతే వ్యాధుల నివారణకు మార్గమని వైద్యులు సూచిస్తున్నారు.

- వర్షాకాలం.. వ్యాధులకు ఆస్కారం
- పరిసరాల పరిశుభ్రత ముఖ్యం
- దోమలతో పొంచి ఉన్న వ్యాధులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

నారాయణవనం : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించకుంటే దోమల కారణంగా వివిధ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. జ్వరాలకు స్థానికంగా, సకాలంలో వైద్యం అందించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అన్నిరకాల రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నారు. జ్వరాలపై జరుగుతున్న సర్వే ప్రకారం కేసులు ఎక్కువ ఉన్న గ్రామాలు, వార్డుల్లో ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటుకు వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. గాలి, నీరు ద్వారా సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి జ్వరం వస్తుంది. కొందరికి జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం మూడు రోజులు నుంచి వారం రోజుల వరకు ఉంటుంది. ఈజ్వరం రాకుండా ఉండాలంటే భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. నిల్వ పదార్థాలు తినకూడదు. తాజా, వేడి ఆహారం తీసుకోవాలి.



నారాయణవనం : మురుగు నీటి నిల్వలను పరిశీలిస్తున్న అధికార బృందం

టైఫాయిడ్

టైఫాయిడ్ 'సాల్మొనెల్లా టైఫి' బ్యాక్టీరియా వల్ల వస్తుంది. కలుషితమైన నీరు, ఆహారం వల్ల టైఫాయిడ్ వ్యాపిస్తుంది.

జాగ్రత్తలు
- కాచి చల్లార్చిన నీళ్లు తాగడం ఉత్తమం
- రోజుకు 3 నుంచి 4 లీటర్లు నీళ్లు తాగాలి
- పండ్ల రసం, కొబ్బరినీళ్లు, సూప్ వంటివి తీసుకోవాలి
- వైద్యుల సూచనల మేరకు వైద్యసేవలు పొందాలి

సొంత వైద్యం వద్దు



వర్షాకాలంలో జ్వరంరాగానే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందాలి. సలహాలతో సొంత వైద్యం చేసుకుని ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు. వైద్యుల సిఫార్సుల మేరకు మందులు వాడాలి. అయినా జ్వరం తగ్గకపోతే రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణకు అవసరమైన మందులు వాడి, జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

-దర్శిత్ రాజ్, వైద్యాధికారి, నారాయణవనం పీహెచ్‌సీ

డెంగీ

ఈడిస్ అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాపిస్తుంది. వైరల్ మాదిరిగా అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తలనొప్పి, ఒళ్లు నొప్పులు, ఎముకలు విరిగేటంత నొప్పింటుంది. ఒక్కసారిగా శరీర అంతర భాగాల్లో రక్తస్రావం ఉంటుంది. కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదర భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్నపాటి పొక్కులు వస్తాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుంది. కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువు లు, టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షం నీటిలో ఈడిస్ దోమలు వృద్ధి చెందుతాయి.

జాగ్రత్తలు
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి
- దోమ తెరలు వాడడం మేలు
- వారంలో ఒక్క రోజు డ్రైడే పాటించాలి
- దోమలు కుట్టకుండా శరీరం కప్పేలా దుస్తులు వేసుకోవాలి
- జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

హెపటైటిస్-ఏ

వర్షాకాలంలో హెపటైటిస్-ఏ(కామెర్లు) వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కలుషితమైననీరు, ఆహారం ద్వారా ఈ వ్యాధికి సంబంధించిన సూక్ష్మక్రిములు శరీరంలోకి వ్యాపిస్తాయి. ఇది కాలేయ కణాల్లో సంక్రమిస్తుంది. కాలేయ వ్యాధి కారణంగా రక్తంలో 'బిలిరుబిన్' పరిమాణం పెరుగుతుంది. తద్వారా శరీర భాగాలు పసుపు రంగులో కనిపిస్తాయి.

జాగ్రత్తలు
- శుభ్రమైన ఆహారం తీసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి.

మలేరియా

ఆడ అనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాపిస్తుంది. దోమ కాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయి. 14 రోజుల తరువాత తీవ్ర జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్నవర్షం నీటిలో వృద్ధి చెందుతాయి.

జాగ్రత్తలు
- దోమ కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి.
- నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్ గాని పురుగుల మందు కానీ కలపాలి.

చికున్ గున్యా

దోమకాటు వల్ల చికున్ గున్యా వస్తుంది. తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు చికున్ గున్యా లక్షణాలు రోజురోజుకూ జ్వర తీవ్రత పెరుగుతోంది.

జాగ్రత్తలు
- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- కూలర్లు, టైర్లు తదితరాల వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి.
- రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

గురుకుల ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ



దామోదర్‌నాయుడు

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెలుగుగంగ కాలనీ గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్‌గా దామోదర్‌నాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌తో పాటు కళాశాల కూడా ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రభుత్వం పరంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు నేడు ఉన్నత స్థానంలో పేరుప్రఖ్యాతులు పొందుతున్నారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కార్పొరేట్‌స్థాయి విద్యను నేడు గురుకుల పాఠశాలలో అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామం వద్ద కాళంగి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం ఎస్ఐ వెంకటనరసింహం పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. అక్రమంగా తరలించకూడదని పలుమార్లు హెచ్చరిస్తున్నా ట్రాక్టర్ల యాజమానులు పట్టించుకోవడం లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కండలేరులో 6.347టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.347 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆగమోక్తంగా సంకట హర చతుర్దశి



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీఅంజిఅంజి వినాయకస్వామి సన్నిధిలో మంగళవారం సంకట హర చతుర్దశి పూజలు ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబం నిర్వహించుకునే విధంగా దేవస్థానం ఆర్జిత సేవగా తీసుకు వచ్చింది. మంగళవారం ఆలయ ఆవరణలో ధ్వజస్తంభం సమీపంలో ఉండే శ్రీఅంజిఅంజి వినాయకస్వామి సన్నిధిలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించి, దీప ధూప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం ఈవో నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

శాస్త్రీయ దృక్పథం పెరగాలి



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: మూఢ నమ్మకాలను కూకటివేళ్లతో పెకలించాలంటే అందరిలో శాస్త్రీయ దృక్పథం పెరగాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌లో మంగళవారం సీపీఎం శాఖ కార్యదర్శుల నాలుగురోజుల రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బీజేపీ తమ స్వార్థ రాజకీయాల కోసం భౌతిక వాదానికి బదులు మతభావజాలాన్ని ప్రజల్లో ప్రేరేపిస్తున్నాయని తెలిపారు. మూఢ నమ్మకాలు పెరిగితే భావితరాల భవిష్యత్తుకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సామాజిక రుగ్మతలను తరిమి కొట్టాలంతే ప్రతి కార్యకర్తల అసలైన భౌతిక వాదిగా మారాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు అంగేరి పుల్లయ్య, నాగరాజు, గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, వెంకటేష్, మనోహర; వెలివేంద్రం, కుప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ శ్రీలత

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 'ప్రోగ్రామింగ్ ఇన్ సీ విత్ ల్యాబ్ ఎక్సర్‌సైజెస్' అనే పుస్తకాన్ని మంగళవారం ప్రిన్సిపల్ శ్రీలత ఆవిష్కరించారు. కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకుడు ఏ.రవికుమార్ మరో ముగ్గురితో కలిసి బీసీఏ కోర్సు మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్‌కు సంబంధించి ఈ పుస్తకాన్ని రచించారు. పుస్కక ఆవిష్కరణ అనంతరం రవికుమార్‌ను ప్రిన్సిపల్ అభినందించారు. అధ్యాపకులు నరసింహవర్మ, బాపనయ్య, మునెయ్య, సతీష్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, రాజేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకల్యాణ వెంకన్న



స్వర్ణ తిరుచ్చిపై ఉభయ దేవేరులతో స్వామివారు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు మంగళవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అభిషేక సేవ నిర్వహించి, మరకత మాణిక్యాలు, వజ్రవైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ అనంతరం స్వామి, అమ్మవార్లు బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

నేటి నుంచి విద్యుత్ ఫిర్యాదుల స్వీకరణ

ఏర్పేడు: మండలంలోని విద్యుత్ ఉప కేంద్రాల్లో బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ముసలిపేడు, 27న రాజులపాలెం, 28న వికృతమాల డిక్షన్ కర్మాగారం ఉప కేంద్రాల్లో ప్రత్యేక ఫిర్యాదుల కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. మీటర్ల మరమ్మతులు, సర్వీసు వైర్లు, మీటర్లు మార్పు, అధిక బిల్లులు జారీ తదితర సమస్యలను పరిష్కారించుకోవచ్చని పేర్కొన్నారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణవనం: మండలంలో డయేరియా వ్యాప్తి చెందకుండా అన్ని శాఖల క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో కృష్ణమూర్తి, మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో 'స్టాప్ డయేరియా' కార్యక్రమంలో భాగంగా తాగునీటి నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ తాగునీటిని సరఫరా చేస్తున్న రక్షిత నీటి పథకం పైపులైన్ల లీకేజీలను గుర్తించి, మరమ్మతులు చేయించాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేసి నీటిని సరఫరా చేయాలన్నారు. కొళాయిలు, చేతి పంపుల వద్ద, మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు. గ్రీన్ అంబాసిడర్లతో వ్యక్తిగత పారిశుద్ధ్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని తెలిపారు. వైద్యాధికారి దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ నీటి కాలుష్యంతోనే డయేరియా ప్రబలుతుందని అన్నారు. మండలంలో కీళగరం, కసిమిట్ట, తిరువట్యం, ఎరికంబట్టు, తుంబూరు, పాలమంగళం పంచాయతీల్లో పరిసరాల అపరిశుభ్రత, తాగునీటి కాల్యుష్యం కారణాలతో జ్వరాలు, డయేరియా సోకుతోందని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది పరిశుభ్రతపై గ్రామాల్లో అవగాహన కల్పించి డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా ఏఈ సరిత, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగ: మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

పైప్‌లైన్ లీకేజీలను గుర్తించాలి

బుచ్చినాయుడుకండ్రిగ: వర్షాకాలంలో డయేరియా సోకకుండా తాగునీటి పైపులైన్ల లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయించాలని, తాగునీటి ట్యాంకులలో క్లోరినేషన్ చేయించాలని, మురుగునీటి కాలువలను శుభ్రం చేయించడం వంటి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో డయేరియాపై వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ఆశాలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి దివాకర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వర్షకాలం వచ్చే జబ్బులు రెండు రకాలుగా ఉంటాయని, అవి ఒకటి కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులు, రెండవది దోమల ద్వారా వచ్చే వ్యాధులని తెలిపారు. సీహెచ్ఓ వెంకటేశ్వరు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్య, పాల్గొన్నారు.



నారాయణవనం : మాట్లాడుతున్న వైద్యాధికారి దర్శిత్‌రాజ్

ఔషధాల రేడు..నేరేడు

- మధుమేహ నివారణలో కీలకం
- పలు ఆరోగ్య సమస్యలకు మందు

చిల్లకూరు: ప్రకృతి ప్రసాదించిన పలు రకాల పండ్లలో నేరేడు కూడా ఒకటి, వర్షాకాలంలో అందుబాటులోకి వచ్చే నేరేడు పండ్లు తింటే జలుబు, జ్వరాలు వస్తాయని పెద్దలు పిల్లలని వాటి జోలికి పోకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటారు. అయితే వైద్యులు మాత్రం నేరేడు పండ్లే కాదు ఏ పండు అయినా ఆయా సీజన్‌లోనే అందుబాటులోకి వస్తాయి కాబట్టి అతిగా కాకుండా ఎంతవరకు తినాలో అంతవరకు తింటే ఆరోగ్యం బాగుంటుందని అంటున్నారు.



మార్కెట్‌లో నేరేడు పండ్లు



చింతవరం వద్ద రోడ్డుకు ఇరువైపులా నేరేడు చెట్లు

నేరేడు పండ్లు..

ఆరోగ్య ఫల ప్రదాయినిగా ఉండే నేరేడు పండు తింటే పలు ఆరోగ్య సమస్యలను దూరం చేస్తుందని అలాగే మధుమేహంతో బాధపడే వారు నిత్యం పండులోని గింజల పౌడర్‌ను క్రమం తప్పక తీసుకుంటే మధుమేహాన్ని నియంత్రించడంలో ఎంతో కీలకంగా పనిచేస్తుందని ఆయుర్వేద వైద్యులు అంటున్నారు. ఈ పండు రుచిలో మేటిగా ఉండగా, నేరేడు ఆకులు, చెట్టు బెరడు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఈపండులో అత్యధిక పోషకాలు ఉండడంతో ఆరోగ్యపానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్‌ల లోనూ తీసుకుంటూ ఉంటారు. నేరేడు కాయలను వెనిగర్, వైన్‌ల తయారీలోనూ ఉపయోగిస్తుంటారు. ఈ పండ్లు కోసేందుకు శ్రమ పడాల్సి వస్తుంది కాబట్టి వీటి ధర కూడా ఎక్కువగానే ఉంటుంది. రైతుల దగ్గర వ్యాపారులు కేజీ రూ.150 నుంచి రూ.175 వరకు కొనుగోలు చేసి వాటిని మార్కెట్‌లో వ్యాపారం చేసుకునే వారికి రూ.200 వరకు విక్రయిస్తుంటారు. దీంతో రీటైల్‌గా ఒక కేజీ రూ.250 నుంచి రూ.300 వరకు అమ్ముడు పోతున్నాయి. రోజుకు ఒక పండు తింటే శరీరంలోని పలు రుగ్మతలను తగ్గించేందుకు ఉపయోగపడతాయి. దీనివల్ల రక్తపోటు, చక్కెర వ్యాధిని నియంత్రించవచ్చు.

బహుళ ప్రయోజనాలు..

- నేరేడు పండు తింటే మూత్ర సమస్యలు నియంత్రణలోకి రావడంతోపాటు మధుమేహం అదుపులో ఉంటుంది. అలాగే కిడ్నీలను శుభ్రపరుస్తాయి. మూత్రాశయంలో ఇన్‌ఫెక్షన్‌ను తగ్గిస్తుంది. కాలేయాన్ని శుభ్రపరిచి పనితీరును మెరుగుపరుస్తుంది.
- నేరేడు పండులో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ, విటమిన్‌లు పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల వ్యాధినిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది.
- వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె, మొదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి.
- దంతాలు, చిగళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి, చిగళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లోని చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- నేరేడు పండులో విటమన్‌లు ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి.
- కడుపులో పేరుకు పోయిన మలినాలను బయటకు పోవడానికి పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది. ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.

ఆరోగ్యానికి మంచిది..

అన్ని సీజన్‌లో లభించే పండ్లు ఆయా సమయాలలో కచ్చితంగా తీసుకోవాలి. అప్పుడు శరీరంలో అన్ని సక్రమంగా ఉంటాయి. వర్షాకాలంలోనే ఎక్కువగా దొరికే నేరేడు పండు తినడం వల్ల ఎన్నో రుగ్మతల నుంచి బయట పడవచ్చు. ప్రధానంగా డయేరియాను అరికడుతుంది. నేరేడు పండు గింజలను ఎండబెట్టి క్రమం తప్పక తీసుకుంటే మధుమేహాన్ని నియంత్రించవచ్చు. ఇలా ఎన్నో ఆరోగ్య సమస్యలకు నేరేడు మంచి ఔషధంగా ఉంటుంది.

డాక్టర్ కలపాటిశేఖర్, వైద్యులు, ఆయుర్వేద ప్రభుత్వ ఆస్పత్రి, మోమిడి